**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



# ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 4 | సంచిక: 116 | పేజీలు: 6 | వెల: రూ.3/- | బుధవారం 5 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


## ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు
# రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలు

### ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలు

**రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు విదేశీ పర్యటనలకు వెళ్లనున్న సీఎం - మంగళవారం రాత్రి ఢిల్లీకి వెళ్లనున్న ముఖ్యమంత్రి**



**హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలకు వెళ్లనున్నారు. ఈనెల 17 నుంచి సెప్టెంబరు 10 మధ్య నాలుగు దేశాల్లో పర్యటించేందుకు ఏర్పాట్లు చేశారు. యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి బృందం పర్యటించనుంది. పలువురు పారిశ్రామిక వేత్తలతో సమావేశాలు కానున్నారు. ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులతో పాటు రాష్ట్రంలో విదేశీ యూనివర్సిటీలు, క్రీడలు, శిక్షణ సంస్థల భాగస్వామ్యంపై చర్చించనున్నారు. ఈనెల 16న ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించి 21ఏళ్లకే చట్టసభలకు పోటీ చేసే అవకాశం ఉండాలంటూ తీర్మానం చేసే అవకాశం ఉంది. ఇవాళ రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లనున్నారు. రేపు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు అనుమతులు, నిధులపై చర్చించనున్నారు.

ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు : తెలంగాణలో ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలను తీసుకురావడం, యువతలో అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను పెంపొందించడం, క్రీడారంగాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన చేపట్టనున్నారు. ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు విదేశీ పర్యటన చేయనున్నారు. హైదరాబాద్ నుంచి ముందుగా యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)కు, అక్కడి నుంచి అమెరికాకు సీఎం వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం : ఈ పర్యటనలో ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొనే అవకాశం ఉంది. ఆయా దేశాల్లో ప్రభుత్వ, విద్యా, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులతో సమావేశాలు నిర్వహించి తెలంగాణ అభివృద్ధికి అవసరమైన సహకారంపై చర్చించనున్నారు.

ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలతో చర్చలు : యూకే, అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ముఖ్యమంత్రి సందర్శించనున్నారు. తెలంగాణలో ఉన్నత విద్యను అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లే దిశగా విద్యాసంస్థల ప్రతినిధులతో సమావేశమై పరస్పర అవగాహన ఒప్పందాలు (వీశీఖ) కుదుర్చుకునే అవకాశాలున్నాయి. ఇప్పటికే కొన్ని విదేశీ విశ్వవిద్యాలయాలు తెలంగాణలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో, మరిన్ని ప్రముఖ సంస్థలను రాష్ట్రానికి ఆహ్వానించే ప్రయత్నాలు జరగనున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే

..మిగతా 2లో




## బీఆర్ఎస్ పార్టీకి క్షుద్రపూజలు చేయడం
# ఒక అలవాటు

**అక్కడకు హరీశ్ రావు ఎందుకు వెళ్లారు?:**

**మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు**

**బీఆర్ఎస్‌కు క్షుద్రపూజలు చేయడం అలవాటని టీపీసీసీ చీఫ్ ఆరోపణ**

**మాజీ మంత్రి హరీశ్ రావు ఆలయాల పర్యటనలపై ప్రశ్నలు**

**జూన్ 2, జులై 23 తేదీల్లో హరీశ్ ఎక్కడున్నారో చెప్పాలని డిమాండ్**

**పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని పట్టించుకోలేదన్న మహేష్ గౌడ్**

**తెలంగాణ ప్రజలకు ఆ పార్టీ క్షమాపణ చెప్పాలని వ్యాఖ్య**

**హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం)**

బీఆర్ఎస్ పార్టీకి క్షుద్రపూజలు చేయడం ఒక అలవాటుగా మారిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఇటీవల కొన్ని ఆలయాలను సందర్శించడంపై ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేశ్ గౌడ్ మాట్లాడారు. జూన్ 2న తిరుచ్చి, జులై 23న శివమొగ్గకు హరీశ్ రావు ఎందుకు వెళ్లారని ఆయన నిలదీశారు. ఆయా తేదీల్లో హరీశ్ రావు ఎక్కడ ఉన్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలకు సంబంధించి తన వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని మహేశ్ గౌడ్ వెల్లడించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ తెలంగాణకు చేసిందేమీ లేదని, అందుకే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో ప్రజల నమ్మకాన్ని బీఆర్ఎస్ పూర్తిగా కోల్పోయిందని ఆయన పేర్కొన్నారు. చేసిన తప్పులకు గాను బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## హిట్లర్ ఆదర్శంతో రేవంత్ రెడ్డి
# హైడ్రాను తెచ్చారు

**హైడ్రా అనేది పేదలను భయభ్రాంతులకు గురి చేసే సంస్థ అన్న ఈటల**

**పేదల నివాసాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్నారని మండిపాటు**

**కోర్టుల ఆదేశాలను కూడా హైడ్రా లెక్కచేయడం లేదని వ్యాఖ్య**



**హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం)**

'హైడ్రా'పై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హైడ్రా అనేది పేదల ఇళ్లను కూలగొట్టి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ఒక వేధింపుల సంస్థగా మారిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వానికి అధికారులను నియమించే విచక్షణాధికారం ఉండవచ్చు కానీ, పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేసే అధికారం మాత్రం లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిట్లర్‌ను

..మిగతా 2లో

# క్షుద్రపూజల వ్యాఖ్యలపై హరీశ్ తీవ్ర ఆగ్రహం



## అద్దంకి, రామ్మోహన్‌కు హరీశ్ లీగల్ నోటీసులు..

**హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌కు బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సోమవారం లీగల్ నోటీసులు పంపారు. రాష్ట్రంలో వర్షాలు పడకూడదని, కరువు రావాలనే ఉద్దేశంతో దేవాలయాలకు వెళ్లి క్షుద్రపూజలు, తాంత్రిక పూజలు చేశారంటూ తనపై ఇద్దరు కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై హరీశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజల్లో తన పేరు ప్రతిష్టలను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ నేతలు ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేశారని లీగల్ నోటీసుల్లో పేర్కొన్నారు. మొక్కులు తీర్చుకొనేందుకు గుడికి వెళ్లడం మన సంప్రదాయమని, అలా భక్తిశ్రద్ధలతో గుడికి వెళ్తే ఆ విషయాన్ని సైతం తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించి వాడుకోవడం కాంగ్రెస్ నేతల సంకుచిత బుద్ధికి నిదర్శనమని మండిపడ్డారు. ఇది భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీయడమేనని నోటీసుల్లో పేర్కొన్నారు.

**ప్రశ్నిస్తున్నందుకే..**

హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్

..మిగతా 2లో

# లైంగిక దాడి ఆరోపణలు

## హైకోర్టులో రేగా కాంతారావు పిటిషన్

**తనపై నమోదైన కేసును కొట్టివేయాలని హైకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే**

**ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి లైంగిక దాడి చేసి, రూ. 5 లక్షలు తీసుకున్నారని యువతి ఫిర్యాదు**

**ఈ ఆరోపణలు అవాస్తవమని, తన ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర అని కాంతారావు వాదన**

**నాలుగేళ్ల నాటి ఘటనపై ఇప్పుడు ఫిర్యాదు చేయడం చట్టవిరుద్ధమన్న మాజీ ఎమ్మెల్యే**



**హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం)**

తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. లైంగిక దాడి, మోసం ఆరోపణలతో హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని ఆయన తన పిటిషన్‌లో అభ్యర్థించారు. ఉద్యోగం ఇప్పిస్తానని, టీవీ ఛానల్ ఏర్పాటుకు సహకరిస్తానని నమ్మించి రేగా కాంతారావు తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా,

..మిగతా 2లో



# విద్య పట్ల కనీస చిత్తశుద్ధి లేని వ్యక్తి రేవంత్

**నామినేషన్ పత్రాలను రేవంత్ రెడ్డి సొంతంగా నింపగలరా?: ధర్మపురి అరవింద్ సవాల్**

**ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి రేంత్ రెడ్డి దారుణ వ్యాఖ్యలు చేశారన్న అరవింద్**

**రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా తయారైందని వ్యాఖ్య**

**హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం)**

ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణమని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం చేసిన వ్యాఖ్యలు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల ఆత్మస్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆగ్రహం

..మిగతా 2లో



## హైదరాబాద్‌కు
# భారీ వర్ష సూచన

**ఎల్లో అలర్ట్ జారీ**

2లో..

**వాయుగుండం కారణంగా తెలంగాణలో భారీ వర్షాలు**

**హైదరాబాద్ లో నేడు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం**

**వాహనదారులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్న అధికారులు**

### ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు

# రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలు

**మొదటి పేజీ తరువాయి...**

స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటైన నేపథ్యంలో, అంతర్జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థలను తెలంగాణకు తీసుకురావడంపై కూడా ఈ పర్యటనలో ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు ఆధునిక శిక్షణ అందించే విధంగా విదేశీ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

క్రీడాభివృద్ధికి కొత్త ప్రణాళికలు : తెలంగాణ యువత ఒలింపిక్స్ సహా అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు సాధించాలని రేవంత్ రెడ్డి పలు మార్లు ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో యూకే, అమెరికాలోని ప్రముఖ క్రీడా అకాడమీలు, శిక్షణా కేంద్రాలను సందర్శించి అక్కడ అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయనున్నారు. రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా మౌలిక వసతులు, శిక్షణా వ్యవస్థలను అభివృద్ధి చేసే అంశాలపై నిపుణులతో చర్చించే అవకాశముంది.

తెలంగాణ అభివృద్ధికి కొత్త అవకాశాలు : ఈ విదేశీ



పర్యటన ద్వారా విద్య, నైపుణ్యాభివృద్ధి, క్రీడా రంగాల్లో తెలంగాణకు ప్రపంచస్థాయి భాగస్వామ్యాలను తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు, ప్రముఖ విశ్వవిద్యాలయాల సహకారం, ఆధునిక శిక్షణా విధానాల అమలు ద్వారా రాష్ట్ర యువతకు కొత్త అవకాశాలు కల్పించడంతో పాటు తెలంగాణను విద్యా, నైపుణ్యాలు, క్రీడల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ పర్యటన కీలకంగా మారే అవకాశం ఉంది.

పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీని పకడ్బందీగా నిర్వహించాలి: సీఎం

పోలీసు ఉద్యోగాల భర్తీపై ఇంటెలిజెన్స్ వర్గాలు సీఎంకు కీలక సమాచారం ఇచ్చారు. నియామక ప్రక్రియకు అడ్డుకోవాలని కొన్ని పార్టీలు చూస్తున్నట్లు సమాచారం. "పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీని పకడ్బందీగా నిర్వహించాలి. నియమ నిబంధనలను అనుసరించి లోపాలు లేకుండా చూడాలి. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాలో అప్రమత్తంగా ఉండాలి. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. కోచింగ్ సెంటర్స్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. నియామక పరీక్షల నిర్వహణపై దుష్ప్రచారం అరికట్టాలి." సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

## యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై వివరణ ఇవ్వండి

## ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం)**

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్టు బోర్డు ఏర్పాటుపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు – వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ  యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్టు బోర్డు ఏర్పాటుపై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బోర్డు ఏర్పాటు నిమిత్తం తీసుకువచ్చిన చట్ట సవరణతో పాటు బోర్డు ఏర్పాటుపై ప్రభుత్వంతో పాటు ట్రస్ట్ బోర్డు చైర్మన్, సభ్యులకూ నోటీసులు జారీ చేసింది. ఆలయానికి ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయవచ్చు : దేవాదాయ శాఖ చట్టానికి సవరణ తీసుకువస్తూ చేర్చిన సెక్షన్లు 96, 97లతో పాటు ఆలయానికి ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జూన్ 30న జారీ చేసింది. ఈ జీవోను సవాలు చేస్తూ నాగిళ్ల శ్రీనివాస్, వ్యవస్థాపక ట్రస్టీ నరసింహ మూర్తిలు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణ చేపట్టింది. రూ.100 కోట్ల ఆదాయం ఉన్న ఆలయానికి ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయవచ్చని, అందులో ఎమ్మెల్యేతోపాటు వంశపారంపర్య ధర్మకర్త తదితరులు సభ్యులుగా ఉంటారని పేర్కొందని, ఇది చట్టవిరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గతంలో సుప్రీం కోర్టు వెలువరించిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ట్రస్ట్ బోర్డు ఏర్పాటైందని పేర్కొన్నారు. ఈ తీర్పు ప్రకారం వంశపారంపర్య ధర్మకర్త ఉన్నపుడు ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేస్తే దానికి చైర్మన్‌గా వంశపారంపర్య దర్మకర్తనే నియమించాలని స్పష్టంగా ఉ




ందన్నారు. వారికి ప్రత్యేక హక్కును కల్పించిందన్నారు. వ్యవస్థాపక ట్రస్టీకి ఉన్న ప్రత్యేక హోదాను తగ్గించి కేవలం ఒక సభ్యుడిగా మాత్రమే నియమించారన్నారు. అంతేగాకుండా రాజ్యాంగంలోని అధికరణ 24, 25 ప్రకారం ఆలయ బోర్డులో ప్రజాప్రతినిధులకు అవకాశం ఇవ్వకూడదన్నారు. ఆలయ నిత్య కైంకర్యాలు, పూజావిధానాలు, ఉత్సవాలు, ఆగమ సంప్రదాయాల నిర్వహణ వంటి అత్యంత కీలక బాధ్యతలను అప్పగించిందన్నారు. పలువురికి నోటీసులు జారీ : ఇవి కేవలం పరిపాలనాపరమైన అంశాలే కాకుండా మతపరమైనవని, అందువల్ల ఇలాంటి వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యంతో హిందూ మత సంస్థలకు రాజ్యాంగం కల్పించిన స్వయం ప్రతిపత్తి దెబ్బతింటోందన్నారు. వాదనలను విన్న ధర్మాసనం సీఎస్, దేవాదాయశాఖ కమిషనర్, ఆలయ ఈవో, చైర్మన్ ఎం.సత్యనారాయణ రెడ్డికి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసు-అదనపు ఛార్జిషీట్‌కు సిద్ధమవుతున్న సిట్

**హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం)**

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈ నెల 15లోపు ఛార్జిషీట్ దాఖలు చేసేందుకు సిట్ కసరత్తు – ముగ్గురు నేతల పేర్లు చేర్చే అంశాన్ని సిట్ పరిశీలిస్తున్నట్లు సమాచారం

తెలంగాణలో తీవ్ర సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో అదనపు ఛార్జిషీట్‌కు సిట్ సిద్ధమవుతోంది. ఈ నెల 15లోపు ఛార్జిషీట్ దాఖలు చేసేందుకు సిట్ కసరత్తు చేస్తోంది. నేతల పేర్లు చేర్చాలా వద్దా అనే అంశంపై న్యాయసలహాలు తీసుకుంటున్నారు. ముగ్గురు నేతల పేర్లు చేర్చే అంశాన్ని సిట్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటివరకు 600 మంది వాంగ్మూలాలను సిట్ నమోదు చేసింది. 600 మంది స్టేట్‌మెంట్ల ఆధారంగా అదనపు ఛార్జిషీట్ సిద్ధం చేస్తున్నారు. ఆ 15 రోజుల్లో 4013 మందిపై నిఘా : ముగ్గురినీ నిందితులుగా చేర్చే విషయంలో ప్రత్యేక దర్యాప్తు బృందం పెద్దఎత్తున కసరత్తు చేసినట్లుగా సమాచారం. కీలక సాక్ష్యాధారాల సేకరణ క్రమంలో వందలమంది వాంగ్మూలాలను అధికారులు సేకరించారు. 2023 నవంబరు 15 నుంచి 30వ తేదీ వరకు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ కేంద్రంగా జరిగినట్లుగా చెబుతున్న ఫోన్ అక్రమ ట్యాపింగ్ వ్యవహారంపైనే కీలక దృష్టి సారించారు. ఆ 15 రోజుల్లో 4013 మందిపై నిఘా ఉంచినట్లుగా ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తులో తేలింది. వారిలో 618 మందికి సంబంధించిన ఫోన్ సంభాషణల్ని అక్రమంగా విన్నట్లుగా గుర్తించారు. ఆ వివరాలను ముందుంచుకుని కేసు ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ మాజీ సీవోవో టి.ప్రభాకర్‌రావును విచారించింది. అయితే ఆయన పోలీస్ ఉన్నతాధికారులపైనే నెపం నెట్టేసినట్లు సమాచారం. వారి ఆదేశాల మేరకే తాను పనిచేశానని చెప్పినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తును కొలిక్కి తెచ్చేందుకు ఓ మాజీ డీజీపీతో పాటు గత ప్రభుత్వంలో నిఘా విభాగంలో పనిచేసిన ఓ ఉన్నతాధికారి వాంగ్మూలాలను కూడా ఇటీవల సిట్ సేకరించినట్లు సమాచారం. గత ప్రభుత్వంలో సీఎంవోలో(ముఖ్యమంత్రి కార్యాలయం), హోంశాఖలో పనిచేసిన ఉన్నతాధికారుల నుంచీ వాంగ్మూలాలు తీసుకుంది. ఆయా అంశాలన్నిటినీ క్రోడీకరించడంతో పాటు దర్యాప్తులో తేలిన సమాచారం ఆధారంగానే బీఆర్ఎస్ ముఖ్యుల్ని నిందితులుగా చేర్చుతూ అనుబంధ అభియోగపత్రాన్ని రూపొందించినట్లుగా తెలుస్తోంది. ఒక్కొక్కరి పాత్రపై ఆధారాలు ఒకరికి మినహాయింపు : తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో ఆ ముగ్గురు నాయకుల పాత్ర ఏమిటనేది అభియోగపత్రంలో సిట్ కూలంకషంగా పొందుపరిచినట్లు సమాచారం. ప్రభాకర్‌రావు నియామకంలోనే మతలబు దాగి ఉందని మొదటి నుంచీ అనుమానిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం, ఆ దిశగా దర్యాప్తు చేసి వీరిలోని ఓ ప్రముఖుడి పాత్రను నిగ్గు తేల్చినట్లు సమాచారం. అలాగే బీఆర్ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్ల విషయంలో మరొకరిని ఎవరిపై అక్రమంగా నిఘా ఉంచాలనే విషయంపై ఆదేశాలివ్వడంలో ఇంకొకరి పాత్రపై ఆధారాలను సేకరించినట్లు సమాచారం. వీరితోపాటు మరో కీలక మాజీ ప్రజాప్రతినిధినీ గతంలో విచారించినప్పటికీ ఆయన పేరును మాత్రం అభియోగపత్రంలో చేర్చలేదని తెలిసింది.

## ప్రముఖ  నటుడు ప్రదీప్ సింగ్ రావత్ కన్నుమూత- సినీ ప్రముఖుల సంతాపం

**హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం)**

గుండెపోటుతో కన్నుమూసిన ప్రదీప్ సింగ్ రావత్– సోషల్ మీడియాలో సంతాపం తెలిపిన అనేక మంది ప్రముఖులు  ప్రముఖ నటుడు ప్రదీప్ సింగ్ రావత్ (74) తుదిశ్వాస విడిచారు. ముంబయిలోని నివాసంలో గుండెపోటుతో ఆయన మంగళవారం కన్నుమూశారు. తన నటనతో ఇప్పటికే మంచి క్రేజ్ సొంతం చేసుకున్న ప్రదీప్ సింగ్ రావత్ మరణం పట్ల అనేక మంది సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలిపారు.



**ప్రదీప్ సింగ్ సినీ జర్నీ**

1952లో దిల్లీలో జన్మించిన ప్రదీప్ సింగ్ రావత్, తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళతోపాటు ఇతర భాషల్లో యాక్ట్ చేశారు. అలాగే కొన్ని దూరదర్శన్ టీవీ సీరియల్స్‌లో కూడా నటించారు. కెరీర్ తొలి రోజుల్లో ఎక్కువగా విలన్‌గా నటించిన ప్రదీప్ రావత్, ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కూడా చేశారు. 1985లోనే ప్రదీప్ రావత్ సినీ ప్రయాణం మొదలైంది. బాలీవుడ్‌లో రాజ్ బబ్బర్ ఐత్ బార్ సినిమాలో తొలిసారి ఓ చిన్న పాత్రలో కనిపించారు ప్రదీప్ రావత్.

ఆ తర్వాత చాలా సినిమాల్లో నటిస్తూ వచ్చినా అక్కడ అనుకున్న రేంజ్‌లో పేరు సంపాదించలేకపోయారు. కొన్ని సినిమాల్లో మాత్రమే ఆడియన్స్‌కు గుర్తుండిపోయే రోల్స్ దక్కాయి. తెలుగులో నితిన్ – రాజమౌళి సై (2004) మూవీతో ఆయన టాలీవుడ్ జర్నీ ప్రారంభమైంది. భిక్షూ యాదవ్‌గా ఆయన పండించిన విలనిజానికి అద్భుతమైన స్పందన వచ్చింది. ఆ తర్వాత వరుసగా తెలుగులో వరుస అవకాశాలు అందుకున్నారు.

భద్ర, అందరివాడు, ఛత్రపతి, లక్ష్మీ, స్టాలిన్, దేశముదురు, యోగి, జగడం, గజిని, మస్కా, ఓయ్, రెబల్, నాయక్, బాద్షా, వన్ నేనొక్కడినే, అల్లుడు శీను, నేను శైలజ, సరైనోడు, నేనే రాజు నేనే మంత్రి, జై లవ కుశ, వాల్తేరు వీరయ్య తదితర టాలీవుడ్ సినిమాల్లో నటించి అందరినీ ఆకట్టుకున్నారు. చివరగా 2026 మే 1వ తేదీన రిలీజ్ అయిన గాయపడ్డ సింహం మూవీలో కనిపించారు. అయితే తన కెరీర్‌లో ఫిల్మ్ ఫేర్ బెస్ట్ విలన్, సంతోషం బెస్ట్ విలన్, నంది అవార్డులు అందుకున్నారు ప్రదీప్ సింగ్ రావత్.



## క్షుద్రపూజల వ్యాఖ్యలపై హరీశ్ తీవ్ర ఆగ్రహం

**మొదటి పేజీ తరువాయి...**

విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే కక్షగట్టి బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగానే వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పుడు వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏయే వార్తా చానళ్లు, ప్లాట్‌ఫామ్స్ ద్వారా ఈ ఆరోపణలు చేశారో అవే మాధ్యమాల ద్వారా బహిరంగ క్షమాపణ చెప్పాలని లీగల్ నోటీసుల్లో డిమాండ్ చేశారు. సోషల్ మీడియా, వెబ్‌సైట్లు, ప్రెస్ ఆర్కైవ్స్, ఇతర డిజిటల్, ప్రింట్ ప్లాట్‌ఫామ్స్ నుంచి ఈ తప్పుడు వీడియోల పోస్టులను తొలగించాలని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా క్షమాపణ చెప్పకపోయినా, వీడియోలు డిలీట్ చేయకపోయినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. న్యాయస్థానంలో సివిల్, క్రిమినల్, పరువు నష్టం దావాలు వేయాల్సి వస్తుందని తేల్చిచెప్పారు.

### హిట్లర్ ఆదర్శంతో రేవంత్ రెడ్డి

## హైడ్రాను తెచ్చారు

**మొదటి పేజీ తరువాయి...**

ఆదర్శంగా తీసుకుని హైడ్రాను స్థాపించారని ఈటల అన్నారు. నాడు హిట్లర్ ప్రజలను వేధించి తీవ్ర విధ్వంసం సృష్టిస్తే, నేడు రేవంత్ రెడ్డి హైడ్రా ద్వారా తెలంగాణ ప్రజలను అదే రీతిలో వేధిస్తున్నారని ఆరోపించారు. నలభై, యాభై ఏళ్ల క్రితం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చి చెరువులు, కాలువల పక్కన రెక్కల కష్టం మీద ఇళ్లు కట్టుకున్న పేదల నివాసాలను ఇప్పుడు నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కావాల్సిన బడా బాబులకు భూములు కట్టబెట్టడానికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నవారిని బ్లాక్‌మెయిల్ చేయడానికే రేవంత్ రెడ్డి హైడ్రాను ఒక ఆయుధంగా వాడుకుంటున్నారని ఈటల విమర్శించారు. ప్రస్తుతం నగరంలో హైడ్రా భయంతో ఇల్లు కొనడానికి కూడా ప్రజలు జంకుతున్నారని వ్యాఖ్యానించారు. రెవెన్యూ, మున్సిపల్, హోం శాఖల కంటే హైడ్రా ఒక సుప్రీం శాఖలా వ్యవహరిస్తోందని, ఆఖరికి కోర్టుల ఆదేశాలను కూడా లెక్క చేయడం లేదని ధ్వజమెత్తారు. అసలు ఈ సంస్థ సీఎం రేవంత్ రెడ్డి మాటైనా వింటుందో లేదో అనే అనుమానం కలుగుతోందని ఎద్దేవా చేశారు.

## హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన

**హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం)**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా తెలంగాణలో వర్షాలు విరామం లేకుండా కురుస్తున్నాయి. వీటి ప్రభావంతో నేడు హైదరాబాద్ నగరం వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు నగర ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుందని, పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిన్న హైదరాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కుండపోత వర్షం ముంచెత్తింది. గడిచిన 24 గంటల్లో కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 18.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా... వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోనూ భారీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రోడ్లపైకి వస్తున్న వాహనదారులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## లైంగిక దాడి ఆరోపణలు

**మొదటి పేజీ తరువాయి...**

తన వద్ద నుంచి రూ.5 లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేశారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఈ ఆరోపణలను రేగా కాంతారావు తన పిటిషన్‌లో తోసిపుచ్చారు. రాజకీయ, వ్యక్తిగత కారణాలతో తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఈ తప్పుడు కేసు బనాయించారని ఆయన పేర్కొన్నారు. నాలుగేళ్ల క్రితం జరిగినట్లు చెబుతున్న ఘటనలపై ఇప్పుడు ఫిర్యాదు చేయడం చట్టవిరుద్ధమని, అందువల్ల ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని ఆయన కోర్టును కోరారు. ఈ పిటిషన్ ఆగస్టు 5వ తేదీన జస్టిస్ బి.ఆర్. మధుసూదన్ రావు ధర్మాసనం ముందు విచారణకు వచ్చే అవకాశం ఉంది.

## విద్య పట్ల కనీస చిత్తశుద్ధి లేని వ్యక్తి రేవంత్

**మొదటి పేజీ తరువాయి...**

వ్యక్తం చేశారు. విద్య పట్ల కనీస చిత్తశుద్ధి లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండటం ఏమాత్రం సరైనది కాదని విమర్శించారు. సీఎం వద్ద ఉన్న విద్యాశాఖ బాధ్యతలను వెంటనే మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను రేవంత్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించిన అరవింద్... ఎవరి సహకారం కూడా తీసుకోకుండా సీఎం నామినేషన్ పత్రాలనైనా సొంతంగా నింపగలరా? అని సవాల్ విసిరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా తయారైందని... కనీసం బ్లాక్ బోర్డులు, చాక్ పీసులు, సరైన మరుగుదొడ్లు కూడా లేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఒక్క ప్రభుత్వ పాఠశాలనైనా సందర్శించారా? అని ప్రశ్నించారు. ఉన్న పాఠశాలలను బాగుచేయడం వదిలేసి, కొత్త నిర్మాణాల పేరుతో కమీషన్లు దండుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా విద్యా రంగానికి ప్రాధాన్యమిచ్చి సమస్యలను పరిష్కరించాలని ఎంపీ డిమాండ్ చేశారు.

# మైలార్ దేవుపల్లి డివిజన్‌లో జరిగిన ఘటాల ఊరేగింపులో పాల్గొన్న బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి



మైలార్ దేవ్‌పల్లి డివిజన్ లో ఘటాల ఊరేగింపు లో పాల్గొన్న బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి



బాబుల్ రెడ్డి నగర్ లో జరిగిన ఘటాల ఊరేగింపు లో పాల్గొన్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బీ ఆర్ ఎస్ ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి

**బుద్వేల్, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం) :**

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ల పరిధిలోని వివిధ కాలనీలలో ప్రజలు సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బీ ఆర్ ఎస్ పార్టీ ఇన్‌ఛార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి వివిధ కాలనీల దేవాలయాలను సందర్శించి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని, భక్తులతో కలిసి ఊరేగింపులో నడిచారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ... "తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, భక్తిభావానికి బోనాల పండుగ నిదర్శనం. అమ్మవారి కరుణా కటాక్షాలతో రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నాను. కాలనీల్లో ప్రజలు పండుగను ఇంతటి ఉత్సాహంతో, సోదరభావంతో జరుపుకోవడం సంతోషదాయకం. నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఊరు, ప్రతి కాలనీ అభివృద్ధి చెందడమే మన అందరి లక్ష్యం." కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ మాట్లాడుతూ..."మన ప్రియతమ నాయకులు కార్తీక్ రెడ్డి నాయకత్వంలో డివిజన్‌లో బోనాల ఉత్సవాలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. ప్రతి కాలనీలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కార్యక్రమాలను విజయవంతం చేసుకున్నాం. కార్తీక్ రెడ్డి నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉంటారు." ఈ కార్యక్రమంలో మైలర్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు గుమ్మడి కుమార్ తో పాటు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రమేష్ ముదిరాజ్ , రాము యాదవ్ , రాఘవేందర్ యాదవ్ , రాజేష్ యాదవ్ , కార్మిక శాఖ విభాగ్ అధ్యక్షులు ఉప్పల్ శ్రీను , ప్రవీణ్ , మైసి రెడ్డి , వెంకటరమణ , సునీల్ , మహేష్ , సమ్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి ,అఖిల్ , నిఖిల్ , నితిన్ , చిరు , పవన్ , అనిల్ , చిన్న , కొన్ని , సోను , దీపు , గాంధీ , పవన్ , చింటూ మరియు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు , తదితరులు పాల్గొన్నారు..



విద్యుత్ డీఈ పి రత్నాకర్ రావు కు ధన్యవాదాలు తెలుపుతున్న రజిత, విద్యుత్ ఉద్యోగులు

## విద్యుత్ ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్తా

### రాజేంద్రనగర్ డీఈ రత్నాకర్ రావు

**బుద్వేల్, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం)**

విధ్యుత్ ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళతానని రాజేంద్రనగర్ డివిజన్ విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ పి రత్నాకర్ రావు అన్నారు. శం షాబాద్ సబ్ డివిజన్ చిన్న గోల్కొండ లో విధ్యుత్ తో మృతి చెందిన ఆర్టిజన్ అనిల్ కుమార్ భార్య ఎం రజిత కు కారుణ్య ఉద్యోగం తో పాటు రూ.34 లక్షల ఎక్స్ గ్రేషియా ఇప్పించడం జరిగింది. కోటి రూపాయల ఎస్బీఐ ఇన్సురెన్స్ ను ఇప్పించారు. ఈ సందర్భంగా రజిత కుటుంబానికి అండగా నిలచి విద్యుత్ యాజమాన్యం నుంచి రావాల్సిన ఆర్థిక సహాయం, ఉద్యోగం ఇప్పించడంలో విశేషంగా కృషి చేసిన డీఈ రత్నాకర్ రావు కు విద్యుత్ ఉద్యోగుల సంఘం హెచ్82 నాయకులు కిరణ్, రాజు లతో పాటు అనిల్ కుమార్ భార్య రజిత ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగ సంఘం నాయకులు కె రాజు, అనిల్, సిద్దులు. స్వామి, సాజిద్ లు పాల్గొన్నారు.



కిస్మత్ పూర్ లోని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సర్ పై రాజకీయ పార్టీల నాయకుల తో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

## సర్‌ను పూర్తి స్థాయిలో చేయడానికి రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలి

### రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

**బుద్వేల్ , ఆగస్టు 4 ( ప్రభాత ఉదయం) :**

రాజేంద్రనగర్ నియోజకవర్గం లో ఓటరు జాబితా నమోదు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని నూటికి నూరు శాతం పూర్తి చేయడానికి రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కిస్మత్ పూర్ లో గల రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సర్ కార్యక్రమం పై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 60 శాతం మంది ఓటర్లు తమ ఎన్యుమరేషన్ ఫారాలను బీఎల్ఓ లకు అందజేశార న్నారు. మిగతా ఓటర్లు కూడా మిగిలిన ఆరు రోజులలో తమ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి తిరిగి ఇచ్చే టట్లు రాజకీయ పార్టీల నాయకులు చొరవ తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఓటర్లు తమ పేర్లను మ్యాపింగ్ చేసుకొనట్లయితే బీ ఎల్ ఓ లను కలసి మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## చింతల్‌మెట్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం





**రాజేంద్రనగర్,ఆగస్టు04 (ప్రభాత ఉదయం)**

సైబర్ నేరాల పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు చింతల్‌మెట్ క్రాస్‌రోడ్డు,సెక్టార్-3లోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో మంగళవారం సైబర్ నేరాల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య,ఎస్ఐ జయరాజ్,సైబర్ వారియర్,పోలీస్ సిబ్బంది పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు.సుమారు 200 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఒకేసారి వచ్చే సంకేత సంఖ్య మోసాలు,ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు,రుణాల యాప్‌ల వేధింపులు,ఏపీకే ఫైళ్ల ద్వారా జరిగే మోసాలు,పెట్టుబడుల పేరుతో మోసాలు,క్రెడిట్ కార్డు మోసాలు,డిజిటల్ అరెస్టు పేరుతో జరిగే మోసాలు,ఆధార్,పాన్ కార్డు దుర్వినియోగం వంటి అంశాలపై అధికారులు వివరించారు.తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్,సందేశాలు,లింకులు,యాప్‌లను నమ్మవద్దని,వ్యక్తిగత,బ్యాంకు వివరాలు,ఒకేసారి వచ్చే సంకేత సంఖ్యను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు.ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే సంబంధిత పోలీసులను లేదా సైబర్ నేరాల సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని అధికారులు విద్యార్థులకు సూచించారు.

# సైబర్ క్రైం పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి





సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య

### ఇన్స్ పెక్టర్ఎ సీతయ్య

**బుద్వేల్, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం):**

సైబర్ క్రైం పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య తెలిపారు. మంగళవారం చింతల్మెట్ లోని గౌతమ్ మాడల్ స్కూల్ విద్యార్థులకు ఎస్ఐ జయరాజ్, సైబర్ వారియర్స్ తో కలసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఓటీపీ చెప్పమని మోసం చేసే వారుంటారని, అపరిచిత వ్యక్తులకు ఫోన్లో వచ్చే ఓటీపీ ఎలాంటి పరిస్థితిలో చెప్ప వద్దన్నారు. ఆన్ లైన్ లో మాట్లాడి ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేస్తారని, అలాంటి వాటిని నమ్మవద్దన్నారు. లోన్ యాప్ ల ద్వారా రుణాలు ఇచ్చి ఆ తర్వాత అన్ని రకాలుగా హింసిస్తారని లోన్ యాప్ పట్ల దూరంగా ఉండాలన్నారు. ఇలా ఆధార్ కార్డు నెంబరు అడిగి, పాన్ కార్డు నెంబర్ అడిగి మోసాలకు పాల్పడతారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో డబ్బులు లాగడానికి ప్రయత్నిస్తారని, అలాంటి వాటికి భయపడకుండ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. లేదా 1930 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు



గాన్సిడ్ యూఎస్ఎ కాంగ్రెస్ - 2026 బ్రోచర్ ను ఆవిష్కరిస్తున్న తలసేమియా సికిల్ సెల్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్, తదితరులు

## హైదరాబాద్ వేదికగా అక్టోబరులో గాన్సిడ్ యూఎస్ఎ కాంగ్రెస్ 2026 సదస్సు

**బుద్వేల్, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం) :**

హైదరాబాద్ వేదికగా అక్టోబరు లో గ్లోబల్ యాక్షన్ నెట్వర్క్ ఫర్ సికిల్ సెల్ అండ్ అదర్ ఇన్హెరిటెడ్ బ్లడ్ డిజార్డర్స్ (గౌన్సిడ్) సదస్సును నిర్వహిస్తున్నట్లు రాజేంద్రనగర్ రాఘవేంద్ర కాలనీ లో గల తలసేమియ సికిల్ సెల్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన గాన్సిడ్ యూఎస్ఎ కాంగ్రెస్ 2026 సదస్సు బ్రోచర్ ను ఆవిష్కరించారు. గాన్సిడ్ యూఎస్ఎ సహకారంతో గాన్సిడ్ కాంగ్రెస్ పేరుతో అక్టోబరు 23 నుంచి 25 వరకు హెచ్ఐసీసీ నోవాటెల్ లో ఈ సదస్సు ఉంటుందన్నారు. ప్రతినిధులు ఇప్పటి నుంచే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ తెలిపారు. జన్యుపరంగా ఒక తరం నుంచి మరో తరానికి వచ్చే రక్త సంబంధిత వ్యాధుల చికిత్సలో వస్తున్న సరికొత్త మార్పులు, పరిశోధనలు, మెరుగైన వైద్య విధానాలను పంచుకునేందులకు ఈ సదస్సు వేదిక కానుంది. ఇందుకోసం దేశ విదేశాలకు చెందిన వందలాది మంది ప్రముఖ వక్తలు, టాప్ వైద్యులు, పరిశోధకులు, ప్రయోగశాల శాస్త్రవేత్తలు, రోగుల క్షేమ సంఘాలు, పరిశ్రమల ప్రతినిధులు, పాలసీ మేకర్లు, అంతర్జాతీయ ఆరోగ్య సంస్థల ప్రతినిధులు ఈ కాం గ్రెస్ లో ఒకే వేదికపై పాల్గొనున్నారని డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ తెలిపారు.

## బీజేపీ అస్సాం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రవీందర్ రాజును మర్యాదపూర్వకంగా కలిసిన ఉమా మహేశ్వరీరెడ్డి

**బుద్వేల్ , ఆగస్టు 4 (ప్రభాత ఉదయం) :**

అస్సాం రాష్ట్ర బీజేపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా పనిచేస్తున్న రవీందర్ రాజు ను ఇటీవల తెలంగాణ రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు కె ఉమా మహేశ్వరీ రెడ్డి అస్సాం లో కలిశారు. రవీందర్ రాజు గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా పనిచేశారు.



అస్సాం రాష్ట్ర బీజేపీ కార్య నిర్వాహక కార్యదర్శి రవీందర్ రాజు ను మర్యాద పూర్వకంగా కలసిన ఆ పార్టీ మహిళా నాయకురాలు కె ఉమా మహేశ్వరి రెడ్డి

## దుర్గామాత ఆలయంలో బోనం సమర్పించిన బీజేపీ నాయకురాలు ఉమా మహేశ్వరీరెడ్డి



దుర్గా మాత అమ్మవారు... అమ్మవారికి బోనం సమర్పిస్తున్న కె ఉమా మహేశ్వరి రెడ్డి

**బుద్వేల్ , ఆగస్టు 4 (ప్రభాత ఉదయం) : :**

రాంబాగ్ దుర్గామాత దేవాలయంలో మంగళవారం బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు కె ఉమా మహేశ్వరీ రెడ్డి ఆధ్వర్యంలో బోనం సమర్పించారు. పలువురు మహిళలతో కలసి వెళ్లిన ఆమె అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలందరు చల్లంగా ఉండాలని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. పూజా కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు పుష్ప, నాగమణి, బాలమణి, శమంత, భారతి, కవిత, సంధ్య, జయమ్మ, అంజమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.



## తల్లిపాలు అమృతంతో సమానం

### అంగన్‌వాడీలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

### సూపరవైజర్ ఉమారాణి

**రాజేంద్రనగర్,ఆగస్టు04(ప్రభాత ఉదయం)**

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని సూపరవైజర్ ఉమారాణి అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ అంగన్ వాడి కేంద్రంలో ముర్రుపాల వారోత్సవాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు పడితే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు.ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు పట్టాలన్నారు. గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.తల్లిపాలు బిడ్డకు మొట్టమొదటి సంపూర్ణ ఆహారంగా,రక్షణ కవచంగా పనిచేస్తాయన్నారు.తల్లులు తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగించుకోవాలని,శిశువుల ఆరోగ్యవంతమైన భవిష్యత్ కోసం ప్రతి తల్లి తల్లిపాలను తప్పనిసరిగా అందించాలని పిలుపునిచ్చారు.అలా పడితేనే బిడ్డ సంపూర్ణ అరోగ్యంతో పాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు.తల్లిపాల వల్ల చిన్నారుల్లో రోగ నిరోదక శక్తి పెరిగి ఆరోగ్యవంతులుగా ఎదుగుతారన్నారు.తల్లి పాలలో అనేక పోషకాలు, ఎంజైములు,హార్మోన్లు సమపాళ్లలో లభిస్తాయని తెలియజేశారు.8నెలలు నిండిన తర్వాత అదనపు ఆహారం అందిస్తూ 2సంవత్సరాల వరకు తల్లి పాలు పట్టించాలన్నారు.చిన్నారులకు పోషక ఆహారాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలోలలిత,లక్ష్మీ,సంగీత,ఉపాధ్యాయులు రవీందర్, గర్భిణీలు, బాలింతలు,పిల్లల తల్లులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి






**ఇష్టంతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించండి.**

**ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధిలో పరిశ్రమల భాగ్యస్వామ్యం మరింత పెరగాలి**

**బాల వికాస ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం**

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**వావిలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల ప్రారంభం**

**పటాన్ చెరు, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం):**

ప్రభుత్వ విద్యా రంగం అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన ఆవశ్యకత ఉందని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మినీ ఇండియా గా పేరొందిన పటాన్ చెరు నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో పేద మధ్యతరగతి కుటుంబాల పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారని,వాటి బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. విద్యారంగం అభివృద్ధికి బాల వికాస ఫౌండేషన్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. పటాన్ చెరు నియోజకవర్గంలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని వారికి సూచించారు. గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని వావిలాల గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మోల్డ్ టెక్ కంపెనీ సహకారంతో బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన రెండు అదనపు తరగతి గదులను మంగళవారం ఎమ్మెల్సీ అంజిరెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇష్టపడి చదివి, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. విద్యార్థులు విద్యను కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా, సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగడానికి ఒక సాధనంగా భావించాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూపే మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకుని, ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించిన ఆయన, ప్రతిభకు కృషి తోడైతే విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు అత్యధికంగా విద్యను అభ్యసించే ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని పరిశ్రమలు విద్యారంగం అభివృద్ధికి మరిన్ని సిఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరారు. పాఠశాల నుండి ప్రధాన రహదారి వరకు సీసీ రోడ్డు లేకపోవడం మూలంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం ప్రత్యక్షంగా చూస్తున్నానని.. వెంటనే సిసి రోడ్డు నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ తాన్యను ఆదేశించారు. వావిలాల గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ తాన్య, బాల వికాస్ ఫౌండేషన్ అధ్యక్షులు ఇంద్రారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరి రెడ్డి, కౌన్సిలర్లు అశోక్, సతీష్, కో ఆప్షన్ సభ్యులు రవీందర్, సీనియర్ నాయకులు బాల్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, ఆయా వార్డుల ప్రజా ప్రతినిధులు, ప్రోగ్రాం మేనేజర్ తిరుపతి, మోల్డ్ టెక్ పరిశ్రమ ప్రతినిధి ఉగేష్, తదితరులు పాల్గొన్నారు.



## బొల్లారంలో వాహన తనిఖీలు

**12 వాహనాలను సీజ్ చేసిన పోలీసులు**

**పటాన్ చెరు, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం):**

ఐడిఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని బొల్లారం ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డుపై ఇన్స్పెక్టర్ సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో ఆకస్మికంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలలో భాగంగా చెల్లుబాటు అయ్యే వాహన పత్రాలు లేని, అలాగే నిబంధనలకు విరుద్ధమైన నంబర్ ప్లేట్లు కలిగిన 12 వాహనాలను స్వాధీనం (సీజ్) చేసుకున్నారు.ఈ సందర్భంగా వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని చట్టబద్ధమైన పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని, మోటారు వాహన చట్టం ప్రకారం నిబంధనలకు అనుగుణమైన నంబర్ ప్లేట్లను మాత్రమే వినియోగించాలని పోలీసులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఎస్ ఐ అక్షిత, ఎస్ ఐ కిష్టారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## తల్లిపాలే అమృతం

**అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా 'సామూహిక అన్నప్రస' కార్యక్రమం**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం)**

పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించి, వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తోడ్పడేలా గద్వాల్ అర్బన్ ×జఋా ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో "సామూహిక అన్నప్రాశన" కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 2వార్డు కౌన్సిలర్ లక్ష్మీనర్సమ్మ, 3వ వార్డు కౌన్సిలర్ నాగులుయాదవ్, ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరు నెలలు పూర్తయిన చిన్నపిల్లలకు మొదటిసారిగా పౌష్టికాహారాన్ని తినిపించి అన్నప్రసన్న మహోత్సవాన్ని జరిపించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "పిల్లలకు ఆరు నెలల వయస్సు వచ్చినప్పటి నుండి తల్లి పాలతో పాటు పోషకాలతో కూడిన ఘనాహారాన్ని అందించడం ఎంతో అవసరం. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న బాలఅమృతం, గుడ్లు, పాలు మరియు ఆకుకూరల వినియోగంపై తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో సి డిపో రాజేశ్వరి, సూపర్వైజర్ వాహిని, ఏఎన్ఎం నవీన, అంగన్వాడి టీచర్స్ నాగ శేషమ్మ, రాధిక, శాంత,హెల్పర్ పావని,ఆశ వర్కర్స్ సురేఖ హేమలత, సుజాత, చిట్టెమ్మ, శ్యామల, నర్సమ్మ, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

# జూరాల ప్రాజెక్టుతో పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు

**వరద నీటిని సద్వినియోగం చేసుకోవాలి.**

**జూరాల కుడి కాలువ ద్వారా ఆర్డీఎస్ లింక్ కెనాల్స్ కు నీటిని మళ్ళించాలి.**

**వేసవిలో తాగునీటి కొరత లేకుండా ప్రణాళిక అవసరం.**

**కాలువలు, ఇతర మరమ్మత్తుల పనులు వేసవిలోనే పూర్తి చేయాలి.**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**జూరాల ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్.**



**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 4 ( ప్రభాత ఉదయం)**

జూరాల ప్రాజెక్టు పరిధిలో చేపట్టిన జిల్లాలోని వివిధ ఎత్తిపోతల పథకాలతో ప్రస్తుతం వస్తున్న వరద నీటితో అన్ని రిజర్వాయర్లను నింపుకోవడంతో పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీటిని అందించవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.మంగళవారం ధరూర్ మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మ్యాపును, వివిధ రిజిస్టర్ లను పరిశీలించారు. కర్ణాటక ప్రాజెక్టుల నుంచి కొద్దిరోజులుగా కృష్ణా నదికి పెద్ద ఎత్తున వరద వస్తుండడంతో జూరాల ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం, గేట్ల ద్వారా దిగువకు వదులుతున్న, ఎత్తిపోతల పథకాలకు, సమాంతర కాలువలకు వినియోగిస్తున్న వరద నీటి, తదితర వివరాలను సంబంధిత ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ గేట్లను పరిశీలించిన కలెక్టర్ అక్కడి యంత్రాల పనితీరు, సిబ్బంది వివరాలను అడిగారు. పవర్ హౌస్ నుంచి ఉత్పత్తి అయ్యే జలవిద్యుత్ గురించి అధికారులు కలెక్టర్ కు వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూరాల కుడి కాలువ లైనింగ్ మరమ్మత్తులు, ఇతర పనులను వేసవిలోనే పూర్తి చేయాలని చివరి ఆయకట్టుకు కూడా సాగునీరు అందాలంటే కాలువల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టుల నిర్వహణకు వచ్చే నిధులను ఎప్పటికప్పుడు సద్వినియోగం చేసుకుంటే ఎలాంటి సమస్య ఉండదన్నారు. జూరాల కుడికాలువ ద్వారా ఆర్డిఎస్ పరిధిలోని లింక్ కెనాల్సు కు నీటిని మళ్లించేందుకు ప్రయత్నించాలని, ఫలితంగా అలంపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నప్పటికీ కాలువల పరిధిలోని రైతులు ప్రస్తుతం నీటిని విడుదల చేస్తుండడంతో వరి సాగు చేసే అవకాశం ఉందన్నారు. వరి పండించే రైతుల పంటలు చేతికొచ్చే వరకు కాలువల ద్వారా వరి సాగుకు నీటి లభ్యత గురించి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. గద్వాల నియోజకవర్గ పరిధిలోని గూడెం దొడ్డి, ర్యాలంపాడు, తదితర రిజర్వాయర్లను ప్రస్తుతం వస్తున్న వరద నీటితో పూర్తి స్థాయిలో నింపుకోవాలని సూచించారు. వేసవిలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవ్వకుండా ప్రణాళికతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జూరాల గేట్లు తెరవడంతో సెలవు రోజుల్లో పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తున్నందున వంతెనపై ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. సందర్శకులు ఘాట్ల వద్ద నీళ్లలోకి దిగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇరిగేషన్ రహదారుల అభివృద్ధికి ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో మరమ్మత్తులు చేయించేందుకు ఇటీవల జిల్లాలో పర్యటించిన రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించినందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న వివిధ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ వేగవంతం చేయాలని, ఆర్ అండ్ ఆర్ కేంద్రాల్లో నివసిస్తున్న ప్రజలకు పూర్తిస్థాయిలో సదుపాయాలను కల్పించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో నీటిపారుదల శాఖ ఎస్ఈ కేశవరావు, డిఈ నాగేశ్వరరావు, తహసిల్దార్ నందిని, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ శాఖ ఉద్యోగి కుటుంబానికి రూ.34లక్షల ఎక్స్‌గ్రేషియా, కారుణ్య నియామకం

**ఎస్‌బీఐ ద్వారా రూ.1కోటి బీమా(ఇన్సూరెన్స్)మంజూరు..**

**విద్యుత్ ఉద్యోగుల సమస్యలు మేనేజ్మెంట్ దృష్టికి తీసుకెళ్తాం..**

**డిఈ రత్నాకర్ రావు**

**రాజేంద్రనగర్,ఆగస్టు04(ప్రభాత ఉదయం)**

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను మేనేజ్మెంట్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ డిఈ పి రత్నాకర్ రావు తెలిపారు.రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని శంషాబాద్ సబ్ డివిజన్,చిన్న గోల్కొండ ప్రాంతానికి చెందిన విద్యుత్ శాఖ ఆర్టిజన్ ఎం.అనిల్ కుమార్ విధి నిర్వహణలో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి గురై మృతి చెందిన విషయం తెలిసిందే..మృతి చెందిన ఆర్టిజన్ అనిల్ కుమార్ భార్యకు ఏం.రజితకు కారుణ్య ఉద్యోగంతో పాటు డిపార్ట్మెంట్లో ఎక్స్ గ్రేషియా రూ.34లక్షలు,అలాగే ఎస్బిఐ కోటి రూపాయల ఇన్సూరెన్స్ ఇప్పించడం జరిగింది.ఇందులో ముఖ్యభూమిక పోషించిన రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ డిఈ పి.రత్నాకర్ రావుకి హెచ్ 82 నాయకులు కిరణ్,రాజుకి మిగతా నాయకులకు ఏం.రజిత ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఈ సందర్భంగా ఆటిజన్ పలు సమస్యలపై డిఈపి రత్నాకర్ రావు,తో మాట్లాడడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను మేనేజ్మెంట్ తీసుకెళ్లి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఇందులో పాల్గొన్న హెచ్ 82 సర్కిల్ ప్రెసిడెంట్ కె.రాజు,డివిజన్ ప్రెసిడెంట్ అనిల్, డివిజన్ సెక్రెటరీ సిద్ధులు,మిగతా నాయకులు, అలాగే ఇతిహాస్,యూనియన్ నాయకులు స్వామి, సాజిద్,యూనియన్ నాయకులు పాల్గొన్నారు





## రాజేంద్రనగర్ ట్రాఫిక్ సిఐ రాజు బదిలీ.. నూతన సీఐగా బోస్ కిరణ్

**రాజేంద్రనగర్,ఆగస్టు04 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ ట్రాఫిక్ సిఐ సిహెచ్ రాజు మల్టీ జోన్ 2 కు బదిలీ అయ్యారు.ఆయన స్థానంలో సైదాబాద్ ట్రాఫిక్ సిఐగా విధులు నిర్వహిస్తున్న బోస్ కిరణ్ ను నియమించారు.ఈ మేరకు సోమవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో రాజు రిలీవ్ అయ్యారు.ఆయన స్థానంలో బోసు కిరణ్ ను నియమించారు.బోసు కిరణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ట్రాఫిక్ సిఐగా గత సంవత్సర కాలం నుంచి విధులు నిర్వహించిన తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి సీఐ సిహెచ్ రాజు కృతజ్ఞతలు తెలియజేసారు.

# జూరాల ప్రాజెక్టు వద్ద ఏరులై పారుతున్న మద్యం దందా


**చేపల ముసుగులో మందు దందా..**

**నిద్రమత్తులో ఎక్సైజ్ శాఖ**

**అధికారులు విధుల్లో ఉన్నారా? అక్రమార్కులకు అమ్ముడుపోయారా?**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం)**





పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద చేపల విక్రయాల మాటున అక్రమ మద్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయల్సిన జూరాల ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు అక్రమ మద్యానికి అడ్డాగా మార్చేస్తుంటే వనపర్తి, గద్వాల జిల్లా ఎక్సైజ్ , సివిల్ పోలీసులు తమకేమి పట్టన్నట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో మద్యం మత్తులో జూరాల ఎడమ కాలువలో పడి మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. అయి న కూడా అధికారులు పర్యాటక ప్రాంతంలో మద్య నిషేదం చేయడం లేదన్నా అరోపణలు వినిపిస్తున్నాయి.అమరచింత మండలం జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ, ధరూర్ మండలం జూరాల ప్రాజెక్టు సమీపంలో చేపలు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. చేపల విక్రయాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గుడిసెల వద్ద ఘుమఘుమ లాడే వంటకాలతో పర్యాటకులను ఆకర్షిస్తున్నారు. ఇదే క్రమంలో చేపల ఫ్రై, మసాల కర్రీ, పులుసు అరగించడానికి వచ్చే భోజనప్రియులకు ప్రత్యేకంగా మందువిక్రయాలు పాల్పడి అక్కడే సిట్టింగ్ లు ఏర్పాటు చేశారు. చేపల విక్రయాలు అమ్మే దుకాణాల వద్దే బహిరంగంగా మద్యం సీసాలు విక్రయిస్తున్న దృశ్యాలు ప్రసార మాధ్యమాల్లో, సోషల్ మీడియాలో కళ్లముందే కనిపిస్తున్నా... "మా దృష్టికి రాలేదు" అని ఎక్సైజ్ అధికారులు చెప్పడం సిగ్గుచేటు. సంవత్సరాలుగా ఈ దందా బహిరంగంగా సాగుతుంటే అధికారులకు కనిపించకపోవడం వెనుక పెద్ద ఎత్తున 'మామూళ్ల రాజకీయం' నడుస్తోందనేది బహిరంగ రహస్యం. ప్రభుత్వ నిబంధనలను నడిరోడ్డుపై బొందపెడుతున్నా ఎక్సైజ్ శాఖ నోరు మెదపకపోవడం వెనుక అంతర్యం ఏమిటి? రాష్ట్ర ప్రభుత్వం అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపుతుంటే, జూరాల వద్ద మాత్రం అధికారుల అండదండలతోనే ఈ అక్రమ సామ్రాజ్యం వికసిస్తోంది. పర్యాటకులు, మహిళలు, కుటుంబ సమేతంగా వచ్చే ప్రజలు ఈ తాగుబోతుల చేష్టల వల్ల తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.జూరాల ప్రాజెక్టు పరిసరాల్లోని అక్రమ మద్యం నిషేదించాలని, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని పర్యాటకులు అధికారులను కోరుతున్నారు.

# మసాలా దినుసుల్లో విషపూరిత రసాయనాలు

## 13 వ్యాపార సంస్థలపై పోలీసులు దాడులు.. 25.3 టన్నుల కల్తీ మసాలా స్వాధీనం

**హైదరాబాద్(నాంపల్లి),ఆగష్టు04(ప్రభాత ఉదయం)**




హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పలు నకిలీ సుగంధ ద్రవ్యాల (మసాలాల)వ్యాపార , ప్రాసెసింగ్ సంస్థలపై కమిషనర్ టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలోని హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీమ్(హెచ్-ఫాస్ట్),జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ విభాగంతో కలిసి సంయుక్తంగా భారీ తనిఖీలు నిర్వహించింది.ఆహార పదార్థాలలో హానికరమైన రసాయనాల వాడకాన్ని అరికట్టడం,కల్తీని అడ్డుకోవడం,ఆహార భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేయడం,ప్రజారోగ్యాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా హైదరాబాద్ సిటీ.కమిషనర్ ఆఫ్ పోలీస్ వి.సి.సజ్జనార్ పర్యవేక్షణలో చర్యలు చేపట్టారు.ప్రజల నుండి వచ్చిన విశ్వసనీయమైన సమాచారం ఆధారంగా ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ ఆపరేషన్లో భాగంగా,సుగంధ ద్రవ్యాల సేకరణ,ప్రాసెసింగ్, హోల్సేల్ లేదా రిటైల్ విక్రయాలు జరుపుతూ మానవ ఆరోగ్యానికి హాని కలిగిస్తున్న 13వ్యాపార సంస్థలు,ప్రాసెసింగ్ యూనిట్లలో అధికారులు సోదాలు నిర్వహించారు.ఈ దాడుల్లో హానికరమైన సాయనాలు,ప్రమాదకర పదార్థాలు కలిపిన సుమారు 25టన్నుల వివిధ రకాల సుగంధ ద్రవ్యాలను సీజ్ చేశారు.దీనికి సంబంధించి మూడు పోలీసు స్టేషన్లలో మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసి,బాధ్యులైన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు.

**నమోదు చేసిన కేసుల వివరాలు..**

మైలార్ దేవులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2 కేసులు,2.బాలాపూర్ పి.ఎస్.పరిధిలో 1కేసు నమోదు..

అరెస్ట్ చేసిన నిందితులు...

రాహుల్ భాటి,కాటేదాన్,హైదరాబాద్,విశాల్ పన్వార్,బేగంబజార్,దులీచంద్ కచ్చవా,బేగంబజార్ వారిని అరెస్ట్ చేశారు.

తనిఖీల్లో వెలుగుచూసిన నిజాలు..

ఈ తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్,2006 నిబంధనల ఉల్లంఘనలతో పాటు అనుచిత లేబులింగ్,మోసపూరిత ప్రాసెసింగ్ పద్ధతులు వెలుగుచూసాయి.ఎక్కువ లాభాలు ఆర్జించడమే ధ్యేయంగా సుగంధ ద్రవ్యాలలో అత్యంత ప్రమాదకరమైన,విషపూరితమైన పదార్థాలను కలుపుతున్నట్లు గుర్తించారు.ఆహారంలో ఉపయోగించే బుష్ సింథటిక్ ఆరెంజ్ రెడ్,గ్రీన్ ఫుడ్ కలర్స్తో పాటు గుడ్డల రంగులు,పారిశ్రామిక శాశ్వత రంగులు,షైనింగ్ పౌడర్,రైస్ బ్రాన్ ఆయిల్ వంటి విషపూరిత రసాయనాలను ఉపయోగిస్తున్నట్లు అధికారులు కనుగొన్నారు.ఒక తయారీ కేంద్రంలో, నాసిరకం,తిరస్కరించబడిన ఆవాల స్టాక్కు ఫ్యాబ్రిక్ డై,టా లోకల్ పౌడర్,నూనెను కలిపి ఉత్పత్తులకు కృత్రిమమైన మెరుపు,బరువు,పరిమాణాన్ని పెంచుతున్నట్లు తేలింది.ఇతర యూనిట్లలో లవంగాలు,షాజీరా వంటి సుగంధ ద్రవ్యాలకు ఆకర్షణీయమైన రంగు రావడం కోసం సింథటిక్ రంగులను పూస్తున్నట్లు,అలాగే షాజీరా,వామ ఇతర ముఖ్యమైన మసాలాలలో పారిశ్రామిక రంగులను కలుపుతున్నట్లు గుర్తించారు.

**సీజ్ చేసిన సుగంధ ద్రవ్యాలు,కల్తీ చేసిన ముడి సరుకు వివరాలు..**

వామ7,920 కిలోలు,2.జీలకర్ర 6,700 కిలోలు, లవంగాలు 550 కిలోలు,4.షాజీరా 2,280 కిలోలు,సోంప్ 540 కిలోలు,ఆవాలు 4,960 కిలోలు,జీలకర్ర పొడి 2,350 కిలోలు,మెంతులు 13,460 కిలోలు,తెల్ల నువ్వులు 10,000 కిలోలు,షైనింగ్ పౌడర్ 90 కిలోలు,రైస్ బ్రాన్ ఆయిల్ 12 లీటర్లు,12.సింథటిక్ మరియు ఫ్యాబ్రిక్ డై 1.5 కిలోలు,రోలింగ్ మెషిన్లు 3యంత్రాలు కలిపి మొత్తం నిల్వలు 25,300 కిలోలు,89,150 కిలోలు12 లీటర్ల నూనె ఇత్యాది స్వాధీనం.ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చిన తర్వాత,హెఛ్ ఫాస్ట్ బృందం ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లతో కలిసి ఆయా ప్రాసెసింగ్ కేంద్రాల నుండి అనుమానాస్పద శాంపిల్లను ల్యాబోరేటరీ పరీక్షల కోసం సేకరించింది.నిబంధనలను ఉల్లంఘించిన యజమానులపై ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం,2006 మరియు ఇతర చట్టపరమైన నిబంధనల ప్రకారం కఠినమైన చర్యలు ప్రారంభించబడ్డాయి.కల్తీ నెట్వర్క్ను అంతం చేయడానికి,వినియోగదారులకు సురక్షితమైన ఆహార ఉత్పత్తులు మాత్రమే అందేలా చూసేందుకు ఇటువంటి ఉమ్మడి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

**ఆరోగ్య ప్రమాదాలు...**

ఆహార పదార్థాలలో పారిశ్రామిక రంగులు,సింథటిక్ రంగులు మరియు ప్రశస్తమైన టాల్కమ్ పౌడర్ వంటి తినకూడని పదార్థాలను ఉపయోగించడం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి వాటి వివరాలు...కాలేయం మరియు మూత్రపిండాలు దెబ్బతినడం.క్యాన్సర్ కారక రసాయనాల వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరగడం. కడుపునొప్పి, అల్సర్లు వంటి జీర్ణకోశ వ్యాధులు,అలెర్జీలు మరియు చర్మ వ్యాధులు,నరాల వ్యవస్థ మరియు శరీర రోగనిరోధక శక్తిపై దీర్ఘకాలిక ప్రభావం పడుతోందన్నారు.ఇటువంటి కల్తీ వ్యాపారాలు వినియోగదారులను మోసం చేయడమే కాకుండా,పెద్ద ఎత్తున ప్రజారోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తాయి.

**140రోజుల్లో 246టన్నుల కల్తీ ఆహారాన్ని హెఛ్-ఫాస్ట్ సీజ్ చేశారు...**

హెఛ్-ఫాస్ట్ బృందం,జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి నగరం నలుమూలలా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తోంది.ఈ విభాగం ప్రారంభమైన140 రోజుల్లోనే 659 దాడులు నిర్వహించి,202 ఎఫ్ఐఆర్లు నమోదు చేసింది.దాదాపు 246 టన్నుల కల్తీ ఆహారాన్ని స్వాధీనం చేసుకుంది.అంతే కాకుండా తదుపరి చర్యల కోసం232 కేసులను జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించగా 46 పనీర్,83 నెయ్యి విక్రయ కేంద్రాలలో తనిఖీలు చేపట్టింది.ప్రజల నుండి వచ్చిన అనేక ఫిర్యాదులను వెంటనే పరిష్కరించిందన్నారు.ఈ ప్రత్యేక తనిఖీ డ్రైవ్ను టాస్క్ ఫోర్స్ డిసిపి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ నాయకత్వంలో ఇన్స్పెక్టర్లు రంజిత్,అంజయ్య,సబ్ ఇన్స్పెక్టర్లు శంకర్,కృష్ణ,అఖిల్ లు సిబ్బందితో కూడిన హెఛ్ ఫాస్ట్ బృందం నిర్వహించింది.

# చిన్నారుల భద్రత-సంక్షేమమే లక్ష్యం

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం)**




జాతీయ న్యాయ సేవా సంస్థ అమలు చేస్తున్న చిన్నారుల సంక్షేమం మరియు రక్షణకు సంబంధించిన పథకాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో జిల్లా న్యాయ సేవా సంస్థ, జోగులాంబ గద్వాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పరిషత్ పాఠశాల కొండాపూర్, కేటీదొడ్డి మండలంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ బి. శ్రీనివాసులు, జిల్లా సంక్షేమ అధికారి సునంద ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. వారు చిన్నారులకు చట్టం కల్పించిన హక్కులు, నల్సా ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం, పోక్సో చట్టం--2012, బాల్య వివాహాల నిషేధ చట్టం--2006, బాల కార్మిక (నిషేధం మరియు నియంత్రణ) చట్టం, విద్యా హక్కు చట్టం--2009 , జువెనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ మరియు రక్షణ) చట్టం--2015, సైబర్ భద్రతతో పాటు చిన్నారుల రక్షణకు సంబంధించిన ఇతర చట్టాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్నారులు ఎలాంటి వేధింపులు, దుర్వినియోగం లేదా హింసకు గురైన వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 1098 చైల్డ్ హెల్ప్లైన్ సేవలను వినియోగించాలని, అలాగే ఉచిత న్యాయ సహాయం అవసరమైన ప్రతి ఒక్కరూ జాతీయ న్యాయ సేవా సంస్థ టోల్ ఫ్రీ నంబర్ -- 15100కు కాల్ చేసి న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.ప్రతి చిన్నారికి సురక్షితమైన వాతావరణంలో జీవించే హక్కు, విద్యను అభ్యసించే హక్కు, హింస , దుర్వినియోగం నుండి రక్షణ పొందే హక్కును భారత రాజ్యాంగం మరియు వివిధ బాలల సంక్షేమ చట్టాలు కల్పించాయని వివరించారు. విద్యార్థులు సోషల్ మీడియా, ఇంటర్నెట్ను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి నరసింహ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జి. రఘు రామి రెడ్డి, సీడబ్ల్యూసీ కౌన్సిలర్ సురేష్, చైల్డ్లైన్ విభాగం ప్రతినిధి నవీన్, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి హనిమిరెడ్డి, భరోసా కేంద్రం ప్రతినిధి శ్వేత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీశైలం జలాశయానికి పెరుగుతున్న వరద

## ఎగువన వర్షాలతో కొనసాగుతున్న ప్రవాహం

**శ్రీశైలం,ఆగస్ట్4 ఆగస్టు 4 (ప్రభాత ఉదయం)**




శ్రీశైలం జలాశయంలో నీటినిల్వలు వేగంగా పెరుగుతున్నాయి. ఐదు రోజుల కిందట ప్రవాహం మొదలై 820 అడుగుల నుంచి పెరుగుతూ వస్తున్న కృష్ణమ్మ.. సోమవారం సాయంత్రానికి 855.10 అడుగులకు చేరింది. ప్రస్తుతం 92.048 టీఎంసీల నీరుంది. మంగళవారం సాయంత్రానికి వంద టీఎంసీలకు చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సోమవారం జూరాల ప్రాజెక్టు నుంచి 2.21 లక్షల క్యూసెక్కులు శ్రీశైలానికి విడుదల చేశారు. రాత్రి సమయానికి శ్రీశైలానికి 1.55 లక్షల క్యూసెక్కులు వచ్చి చేరింది. రోజూ లక్ష క్యూసెక్కులకు పైగా ప్రవాహ ఉధృతి మరో నాలుగైదు రోజులు కొనసాగవచ్చని శ్రీశైలం డ్యాం సీఈ కబీర్ బాషా తెలిపారు. ఎగువన కర్ణాటకలో ఆలమట్టికి వరద కొనసాగుతోంది. ప్రస్తుతం డ్యాంలోకి 1,25,855 క్యూసెక్కుల ఇన్ఫ్లో ఉండగా.. 1.50 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపూర్కు 1,28,954 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా.. 1,40,880 క్యూసెక్కులు వదిలారు. వీటికి భీమా నది వరద జలాలు కలుస్తున్నాయి. దీంతో జూరాలకు మొత్తం 1.92 లక్షల క్యూసెక్కుల ఇన్ఫ్లో వస్తోంది. ఎగువ నుంచి వచ్చే వరదను దృష్టిలో ఉంచుకొని 2,21,765 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. తుంగభద్ర డ్యాంలోకి సోమవారం 57,785 క్యూసెక్కుల ఇన్ఫ్లో ఉంది. తాగునీటి అవసరాల కోసం వివిధ కాలువలకు 1390 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్లో ప్రస్తుతం 136 టీఎంసీల నిల్వలున్నాయి. ఎగువ నుంచి 900 క్యూసెక్కులు వస్తున్నాయి. పులిచింతలలో సోమవారం 28.91 టీఎంసీల నిల్వ ఉంది. ప్రకాశం బ్యారేజీలోకి 6958 క్యూసెక్కులు వస్తుంటే.. 6499 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

# గట్టు ఎంఆర్ఓ కార్యాలయంలో అటెండర్తో వెట్టిచాకిరి?

**గట్టు, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం)**



జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల తహసీల్దార్ (ఎంఆర్ఓ) కార్యాలయంలో అటెండర్తో వెట్టిచాకిరి చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లతో పాటు ఇతర ఉద్యోగులు ఉపయోగించిన ( తిన్న) టిఫిన్ బాక్సులను అటెండర్తో కడిగిస్తున్నట్లు సమాచారం.ప్రభుత్వ ఉద్యోగుల వ్యక్తిగత పనులు చేయించడం, టిఫిన్ బాక్సులు శుభ్రం చేయించడం వంటి పనులు అటెండర్ విధుల్లో భాగం కాదని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటువంటి చర్యలు ఉద్యోగి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తాయని, కార్యాలయాల్లో పనుల కేటాయింపు నిబంధనలకు విరుద్ధమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఈ విషయంపై సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, ఆరోపణలపై విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయడంతో పాటు, వాస్తవాలు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.






# అదుపు తప్పిన యాసిడ్ ట్యాంకర్... తప్పిన పెను ప్రమాదం

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 4(ప్రభాత ఉదయం)**

కేటిదొడ్డి మండలం నందిన్నె గ్రామ శివారులో రాయచూర్ రహదారిపై హైడ్రో క్లోరైడ్ ట్యాంకర్ మంగళవారం బోల్తాపడింది.కర్నూల్ నుంచి ముంబాయి కి రాయచూర్ మీదుగా వెళ్తున్న కేఎ16 డి 3209 నంబర్ గల హెచ్ సి ఎల్ ట్యాంకర్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తాపడింది. ట్యాంకర్ నుండి యాసిడ్ లీకై పొగలు వ్యాపిస్తున్న నేపథ్యంలో వాహనదారులు, ప్రజలు శ్వాస తీసుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడే అవకాశం ఉందని కేటిదొట్టి పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగ డ్రైవర్ నిద్రమత్తువలే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో డ్రైవర్ కు స్వల్ప గాయలయ్యాయి. కర్నూల్ కు చెందిన ఓ కెమికల్ కంపెనీకి చెందిన ట్యాంకర్ గా గుర్తించారు. కర్నూల్ నుంచి మరో టెక్నీషియన్ లను రప్పించి మరో ట్యాంకర్ కు హెచ్ సిఎల్ ను షిఫ్టింగ్ చేశారు. కేటిదొడ్డి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.



# ప్రమాదపుటంచున పర్యాటకులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం)**

ప్రియదర్శిని జూరాల జలాశయానికి ఎగువ నుంచి వరద భారీగా వస్తుండటంతో క్రస్ట్గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఈ సమయంలో కృష్ణమ్మ పరవళ్లను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న పర్యాటకులతో ప్రాజెక్టు దిగువ భాగం కళకళలాడుతున్నా.. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలు నెలకొంటున్నాయి. క్రస్ట్ గేట్ల నుంచి నురగలు కక్కుతూ దిగువకు పారుతున్న నీటి దృశ్యాలను చూసేందుకు, నది అంచునకు వెళ్లి సెల్ఫోన్లలో సెల్ఫీలు తీసుకోవడం, స్నానాలు చేస్తూ కేరింతలు కొడుతుండటంతో ప్రమాదం ఏ రూపంలో వస్తుందో ఉహించలేని పరిస్థితి నెలకొంది. నిత్యం పోలీసు పహార ఉండాల్సిన అవసరం ఉన్నా.. కేవలం నామమాత్రపు గస్తీ నిర్వహిస్తూ వెళ్తుండటంతో పర్యాటకులు నది అంచున వరకు వెళ్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు 33 గేట్లను ఎత్తి దిగువకు సుమారు 2.50 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలానికి వదులుతున్నారు. కృష్ణమ్మ ఉగ్రరూపంలో దిగువన ప్రవహిస్తుండటంతో పరీవాహక ప్రదేశాల్లోకి ఎవరూ వెళ్లకుండా నియంత్రించేందుకు ముళ్లకంచె ఏర్పాటు చేయాల్సిన అధికారులు.. ఇప్పటి వరకు అలాంటి చర్యలు చేపట్టకపోవడం ఆందోళన కలిగిస్తోంది. కేవలం ప్రాజెక్టు పైభాగం నుంచే పర్యాటకులను తిలకించేలా పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# నగరంలో పెద్ద ఎత్తున కల్తీ మసాలాల తయారీ

## 25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం

## ఇప్పటికే ముగ్గురు నిందితుల అరెస్టు

**హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రభాత ఉదయం)**

ఆహార కల్తీకి పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్న హెచ్ -ఫాస్ట్ అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించి పెద్ద ఎత్తున మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో పలు చోట్ల తనిఖీలు చేపట్టి 25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నట్టు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించి.. 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులు, 89.15 టన్నుల ముడిపదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. 3 క్రిమినల్ కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు. సింథటిక్ రంగులు, క్లాత్ డైలు, టాల్కమ్ పౌడర్లు, ఇండస్ట్రియల్ కలర్స్, రైస్ బ్రాన్ అయిల్ నకిలీ మసాలాల్లో వినియోగించినట్టు గుర్తించామన్నారు.